క్లుప్తంగా

3న ముంద్రువారిపాలెంలో ప్రతిష్ట

శావల్యాపురం: మండలంలోని ముంద్రువారిపాలెం గ్రామంలో నూతనంగా శ్రీసీతారామ లక్ష్మణ హనుమత్ సమేత స్వామి శిలా విగ్రహాలు దేవాలయం జీవధ్వజస్తంభం, బోడ్రాయి (నాబిశిల) వచ్చే నెల 3వ తేదీ ఉదయం 8 గంటలకు ప్రతిష్టా వేడుకలు ఆగమ సిద్ధాంతి దివి జ్యోతిర్మయి కుప్పయ్య సారథ్యంలో వేదపండితులు వేదమంత్రాల నడుమ వైభవంగా జరుగుతాయని గ్రామస్తులు సోమవారం తెలిపారు. చివరి రోజు భారీ అన్నదానం కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

సత్తాచాటిన వాసవీ క్లబ్ సభ్యులు

వినుకొండ (నూజెండ్ల): వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ 2023 విజయవాడలో జరిగిన ఇంటర్నేషనల్ స్థాయి పోటీల్లో షటిల్ బ్యాడ్మింటన్ విభాగంలో వినుకొండకు చెందిన ఖజ్జాయం శ్రీహరి, ఇమ్మడిశెట్టి ఆంజనేయులు ప్రతిభ కనపరిచి ద్వితీయస్థానం సాధించారు. వీరిని వినుకొండకు చెందిన పలువురు వాసవీ క్లబ్స్ సభ్యులు అభినందించారు.

జీవన విధానంపై అవగాహన

బొల్లాపల్లి: పర్యావరణహిత జీవన విధానంలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ డీఆర్‌వో వై.సూర్యనారాయణ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనవిధానం, సుస్థిర ఆహార పద్ధతుల అవలంబన, నీటిని, ఇంధనాన్ని పొదుపు చేయడం, ఒకసారి వాడిన ప్లాస్టిక్‌ను తిరిగి వాడకుండా, ఎలక్ట్రానిక్ వ్యర్థాల నియంత్రణ వంటి వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం అటవీ సంరక్షణకు ప్రజలను భాగస్వామ్యులను చేస్తూ ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ శిఖా జ్యోత్స్న, ఎఫ్‌బీవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

3న కౌలు వేలం

నాదెండ్ల: మండలంలోని గొరిజవోలు గ్రామ రెవెన్యూ పరిధిలోని షాహీ మసీదు భూములు బహిరంగ కౌలు వేలం జూన్ 3న నిర్వహిస్తున్నట్లు వక్ఫ్‌బోర్డ్ పల్నాడు జిల్లా ఇన్‌స్పెక్టర్ కరిముల్లాబాషా చెప్పారు. ఖరీఫ్ సీజన్ నుంచి 2023–26 వరకూ మూడేళ్ళ పాటూ కౌలుకు గాను సర్వే నెం.424, 425, 430 పరిధిలోని 32 ఎకరాలను ఉదయం 10 గంటలకు గ్రామ సచివాలయం వద్ద బహిరంగ కౌలు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన రైతులు రూ.10 వేలు ధరావత్తు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. గతంలో రెండు పర్యాయాలు కౌలు వేలం జరగ్గా, రైతుల అభ్యంతరాలతో వాయిదా పడినట్లు తెలిపారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 31వ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు గ్రామస్తుల సారథ్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి బొల్లా పేరయ్య, వూట్ల నాగేశ్వరరావులు సోమవారం తెలిపారు.

స్పందన అర్జీలపై విచారణ

బొల్లాపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పందన అర్జీలపై సోమవారం విచారణ చేశారు. మండలంలోని మేళ్లవాగు, కనుమలచెరువుకు చెందిన బాధితులు గత వారంలో స్పందనలో ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేశామని తహసీల్దార్ వి.సుధాకర్ శర్మ తెలిపారు. అడంగల్ నమోదులో తేడాలు వచ్చినట్లు ఫిర్యాదులో బాధితులు పేర్కొన్నారని, విచారించి రెండు రెవెన్యూ గ్రామాలకు చెందిన బాధితులకు న్యాయం జరిగేలా చేస్తామని చెప్పారు. విచారణలో వీఆర్వోలు, ఆఫీస్ సిబ్బంది, అర్జీదారులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

వినుకొండ(నూజెండ్ల): స్థానిక పురపాలక సంఘం సమావేశమందిరంలో మంగళవారం సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి తెలిపారు. ఈ సమావేశంలో పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు సంబంధించి మొత్తం 24 అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు.

నేడు ఆర్టీసీలో ఇన్వెస్టర్ మీట్

నరసరావుపేట: ఆర్టీసీ గ్యారేజ్‌లో ఖాళీగా ఉన్న స్థలాన్ని అద్దె ప్రాతిపదికపై కేటాయించేందుకు మంగళవారం ఉదయం 10.30కు డిపో ఆవరణలోని తన చాంబర్‌లో ఇన్వెస్టర్ల మీట్ ఏర్పాటు చేసినట్లు జిల్లా రవాణా అధికారి ఎన్.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సెంట్రింగ్ షాపు దగ్ధం

చిలకలూరిపేటటౌన్: అగ్నిప్రమాదంలో అద్దెకు ఇచ్చే సెంట్రింగ్ షాపు పూర్తిగా దగ్ధమైంది. పట్టణంలోని గడియారస్తంభం సెంటర్లోని బ్రహ్మంగారి గుడి వద్ద సోమవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా దుకాణం నుండి మంటలు చెలరేగడంతో స్థానికులు నీళ్లను తెచ్చి ఆర్పే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న చిలకలూరిపేట అగ్నిమాపకశాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటల్ని అదుపులోకి తెచ్చారు. అప్పటికే దుకాణంలోని వస్తువులన్నీ కాలిబూడిదయ్యాయి. అయితే ప్రమాదానికి గల కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

సమాజానికి పెరియార్ అవసరం

నరసరావుపేట: నేటి సమాజానికి పెరియార్ అవసరం ఎంతో ఉందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాషువా పూలే పెరియార్ లిటరేషన్ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో నిర్వహించిన పెరియార్ రీడర్ పుస్తకపరిచయ సభకు విల్సన్ అధ్యక్షత వహించి మాట్లాడారు. సదస్సులో పీడీఎఫ్ రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి నల్లపాటి రామారావు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, మైనార్టీ హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పి.పూర్ణచంద్రరావు, ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కోటా నాయక్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఆర్.ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- డీఎస్పీ మహేష్
- మార్కెట్ సెంటర్‌లో ట్రాఫిక్ కోన్‌ల ఏర్పాటు


మార్కెట్ సెంటర్‌లో ట్రాఫిక్‌పై డీఎస్పీతో చర్చిస్తున్న సీఐలు

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావు పేటలో ప్రజలు అందరూ పోలీసులు అమలు చేసే ట్రాఫిక్ నిబంధనలు పాటించి సహకరించాలని డీఎస్పీ కేవీ మహేష్ కోరారు. సోమవారం జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణ, రూరల్ సీఐలతో కలిసి లాల్‌బహదూర్ కూరగాయల మార్కెట్ సెంటర్‌లో ట్రాఫిక్‌ను పరిశీలించారు. అక్కడ ట్రాఫిక్ క్రమబద్ధీకరణకోసం ట్రాఫిక్ సిమెంట్ కోన్‌లను ఏర్పాటు చేయించారు. పోలీసులు నిర్దేశించిన ప్రదేశంలోనే తోపుడు బండ్లు, కిరాణా, కూరగాయల వ్యాపారులు తమ వ్యాపారాలను నిర్వహించుకోవాలని సూచించారు. అలా చేయని పక్షంలో పోలీసులు తీసుకునే చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో క్రమబద్ధీకరణకు ఉన్న అవకాశాలను పరిశీలించి నిబంధనలు అమలు చేస్తున్నామన్నారు. దీంతోపాటు మెయిన్‌రోడ్లలో ఏర్పాటు చేసిన సిగ్నల్స్ త్వరలో ప్రారంభం కాబోతున్నాయన్నారు. ట్రాఫిక్ సజావుగా సాగేందుకు కావల్సిన ఏర్పాట్లను చేస్తున్నందున వ్యాపారులు, ప్రజలు నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. ఒన్‌టౌన్ సీఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ పట్టణంలోని మార్కెట్, కోట, మయూరి, మల్లమ్మ సెంటర్లలో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుందని గుర్తించటం జరిగిందన్నారు. మల్లమ్మసెంటర్‌లో వాహనాల ఒత్తిడి తగ్గించేందుకు పాతూరులోని ఫంక్షన్ హాలు మీదుగా కోట సెంటర్‌కు వచ్చే మార్గాన్ని ఒన్‌వే చేయాలని డీఎస్పీ సూచించారన్నారు. మోర్ సెంటర్, బ్యాంకు స్ట్రీట్‌లో ఎక్కడబడితే అక్కడ వాహనాల పార్కింగ్ చేయకుండా నిబంధనలు అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో టుటౌన్ సీఐ వీరేంద్ర కుమార్, రూరల్ సీఐ భక్తవత్సల రెడ్డి, ట్రాఫిక్ సీఐ రత్నకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు ఇంటి పట్టాలు పంపిణీ

- మానవత్వం చాటుకున్న ప్రభుత్వం
- కలెక్టరేట్‌లో అందజేసిన జిల్లా జాయింట్ కలెక్టర్, ట్రైనీ కలెక్టర్


ట్రాన్స్‌జెండర్లకు ఇంటి పట్టాలు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాదు, ట్రైనీ కలెక్టర్

నరసరావుపేట: పట్టణ పరిధిలో ఎనిమిది మంది ట్రాన్స్‌జెండర్‌లకు ఇంటి పట్టాలను పంపిణీ చేసి జిల్లా జాయింట్‌కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ మానవత్వాన్ని చాటుకున్నారు. సొంత ఇల్లులేక అనేక ప్రాంతాల్లో అద్దెకు ఉంటూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ట్రాన్స్‌జెండర్లు తమకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరుతూ గతవారం 'జగనన్నకు చెబుదాం' (స్పందన) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ జగనన్న పేదలందరికీ ఇల్లు అనే పథకం ద్వారా వారికి ఇంటి పట్టాలను మంజూరు చేయాలని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. వారం తిరిగే లోపు సంబంధిత శాఖల అధికారులు వివరాలను సేకరించి, విచారణ అనంతరం వారి పేరున నరసరావుపేట మండల పరిధిలోని ఇక్కుర్రు గృహ నిర్మాణ లేఔట్‌లో స్థలాలను కేటాయిస్తూ పట్టాలను తయారు చేశారు. సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ట్రాన్స్ జెండర్‌లు జి.ఎల్లమ్మ, షేక్ బాషా, జే.రెడ్డి, శ్రీను నాయక్, చౌడయ్య, సదాశివ, ప్రభుదాసు, ఉషలకు ఇంటి పట్టాలను అందజేశారు. దీనికి వారు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, తహసీల్దార్ ఆర్‌వీ రమణకుమార్, న్యాయవాది అమూల్య, ఆ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గణపవరంలో ప్రతిష్టా మహోత్సవాలు ఆరంభం


గణపవరంలో ప్రతిష్టకు సిద్ధంగా ఉన్న రామాలయం

నాదెండ్ల: మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలో సోమవారం నుంచి ప్రతిష్ట పూజలు ప్రారంభమయ్యాయి. రూ.2.5 కోట్ల వ్యయంతో పూర్తి రాతితో నిర్మించిన రామాలయంలో విగ్రహ, కలశ, ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం 7న ఉదయం 7.43 గంటలకు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 7 గంటలకు విష్ణేశ్వర స్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. గణపవరం, నాదెండ్ల నాగరాజ భజన సమాజం, శ్రీసాయి బృందం ఆధ్వర్యంలో రాత్రి రామనామ సంకీర్తన నిర్వహించారు. మంగళవారం గ్రామ దేవతలకు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాత్రికి సాతులూరు ప్రసన్నాంజనేయ స్వామి భక్తబృందం ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించనున్నారు. టీటీడీ వేదపాఠశాల అధ్యాపకులు మాల్యాంవంతం శ్రీనివాస దీక్షితులు ఆధ్వర్యంలో యాగశాలలో క్రతువు ప్రారంభించనున్నారు. జూన్ 3 నుంచి 6వ తేదీ వరకూ యాగశాలలో హోమాలు, విగ్రహ ఊరేగింపులు జరగనున్నాయి.

7న చినజియ్యర్ స్వామి రాక...

రామాలయ ప్రతిష్ట కార్యక్రమానికి త్రిదండి చినజీయ్యర్ స్వామి రానున్నారు. 6న గణపవరం రానున్న ఆయన యాగశాలలో జరిగే పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారు. 7న ఉదయం 7.43 గంటలకు జరిగే ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా 50 వేల మందికి అన్నదానం నిర్వహించనున్నారు. అదే రోజు ఉదయం 11 గంటలకు స్వామివారి ధ్రువకల్యాణం వేదపండితుల ఆధ్వర్యంలో జరగనుంది.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

నరసరావుపేట: శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాతృమూర్తి సుబ్బాయమ్మ నాల్గవ వర్థంతిని పురస్కరించుకుని సోమవారం గోపిరెడ్డి యువసేన నాయకులు స్టేషన్‌రోడ్‌లో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాదచారులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా గోపిరెడ్డి యువసేన అధ్యక్షుడు పంగులూరి విజయకుమార్ మాట్లాడుతూ సుబ్బాయమ్మ తన పిల్లలను క్రమశిక్షణతో పెంచి సమాజానికి ఉపయోగపడేటట్లుగా తీర్చిదిద్దారన్నారు. పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు మల్లెలఅశోక్, దామవరపు రాఘవులు, బండ్ల మోజేసు శాస్త్రి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ర్యాలీ

నరసరావుపేట: ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి లింగంగుంట్ల కాలనీలోని డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ వైద్యశాల వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. అక్కడ కేక్ కట్‌చేసి రోగులకు పండ్లు పంపిణీ చేయటంతో పాటు రెడ్‌క్రాసు ఆధ్వర్యంలో నిర్వహించే రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేస్తారన్నారు. కార్యక్రమానికి భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

రీసర్వే పనులు ప్రారంభం

నాదెండ్ల: మండలంలోని సాతులూరు గ్రామంలో సోమవారం రీసర్వే పనులు ప్రారంభమయ్యాయి. సర్వే ఇన్‌చార్జి వి.మురళీకృష్ణ, మండల సర్వేయర్ అబ్బూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మూడు బృందాలుగా సర్వే పనులు ప్రారంభమయ్యాయి. గ్రామ పరిధిలో 5352 ఎకరాల భూమి ఉండగా 120 రోజుల్లో సర్వే ప్రక్రియ పూర్తి చేయనున్నారు. వీఆర్వోలు కె.అంజలిదేవి, గ్రామ సర్వేయర్లు సుందరపాల్, హర్షితలు సర్వే పనులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే గ్రామంలో డ్రోన్‌ఫ్లై సర్వే నిర్వహించినందున వాటి ఓఆర్ఐ షీట్ల ఆధారంగా రైతుల పంట పొలాలకు హద్దులు గుర్తించి వాటికి శాశ్వత హద్దు రాళ్లు వేయనున్నారు. రైతులు సహకరించి వారి వద్ద ఉన్న ఆధారాలు సర్వే బృందాలకు అందించాలని, వాటితో పాటూ రెండు ఫోటోలు, బ్యాంకు ఖాతా, ఆధార్ జిరాక్సులు అందించాలని కోరారు. పూర్తి సర్వే అనంతరం రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలు అందిస్తామని తెలిపారు.

నేడు నూజెండ్ల సమావేశం

వినుకొండ (నూజెండ్ల): స్థానిక నూజెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జిలానీ బాషా తెలిపారు. ఎంపీపీ మేడం జయరామిరెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండల సమగ్ర అభివృద్ధిపై చర్చ జరుగుతుందని తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం ఆరంభం కానుంది.

అభివృద్ధికి సహకరించడం లేదు

అధికారులపై జెడ్పీటీసీ తుర్లపాటి చౌడయ్య ఆగ్రహం


విద్యుత్ ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జెడ్పీటీసీ

ఈపూరు: ప్రజాప్రతినిధుల మాట పెడచెవిన పెట్టి అభివృద్ధికి అధికారులు ఆటంకం కలిగిస్తున్నారని జెడ్పీటీసీ తుర్లపాటి చౌడయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఈదర రాధిక అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జెడ్పీటీసీ చౌడయ్య మాట్లాడుతూ విద్యుత్, విద్యారంగం, వైద్యరంగం, ఉపాధిహామీ పథకంతో పాటు అన్ని ప్రభుత్వ శాఖలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించేటప్పుడు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ కనీసం గ్రామంలోని ప్రజాప్రతినిధులకు కూడా తెలియకుండా ప్రారంభిస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని, ఇలాంటి పద్ధతులు మార్చుకోకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. విద్యావ్యవస్థ సక్రమంగా లేదని, 1వ తరగతిలో చేరిన విద్యార్థి పదో తరగతి వరకు సరైన విద్య వచ్చినా, రాకపోయినా ప్రమోషన్ పొందుతున్నాడని అన్నారు. ఇది విద్యావ్యవస్థలో ఉన్న పొరపాటని ఎంఈవో బాబురెడ్డి సమావేశంలో మాట్లాడటంతో పలువురు ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని ప్రైవేటు పాఠశాలల్లో నూటికి నూరు శాతం అత్యధిక మార్కులు విద్యార్థులు సాధిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సాధించకపోవడానికి కారణం ఉపాధ్యాయులు సక్రమంగా పని చేయడం లేదని, బాగా చదువు చెబితే ప్రభుత్వ పాఠశాలల్లో కూడా విద్యార్థులు నూటికి నూరు శాతం సాధిస్తారని, తప్పంతా మీ వద్దే ఉందని, ఒక్కో ఉపాధ్యాయుడు పాఠశాలకు సరిగా హాజరుకాడని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉషాకిరణ్, యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, కొచ్చర్ల సర్పంచ్ దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం


మాట్లాడుతున్న శాంతకుమారి

చిలకలూరిపేట: బాల్య వివాహాల వలన సమాజానికి నష్టమని సీడీపీవో జి.శాంతకుమారి చెప్పారు. ఐసీడీఎస్ నాదెండ్ల ప్రాజెక్టు పరిధిలోని పసుమర్రు సెక్టార్ సమావేశంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సమావేశం వీలిన గ్రామం పసుమర్రులో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో సీడీపీవో శాంతకుమారి పాల్గొని మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన బాలికలను వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు..వారి వలన కలిగే పరిణామాలు, ఇలాంటి వివాహాలు జరిగితే ప్రభుత్వం తీసుకునే చర్యలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. తమ కేంద్రాల పరిధిలోని తల్లులకు వీటిపై అవగాహన కల్పించాలని సూచించారు. ఏసీడీపీవో బి నిర్మలరాణి, సూపర్‌వైజర్ కె.వెంకటరమణ, ఏఎన్ఎం రిజ్వాన, ఎంఎస్‌కె కల్యాణి, సెక్టర్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: బాల్య వివాహాలను అరికట్టడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కీలక పాత్ర వహించాలని ఐసీడీఎస్ నాదెండ్ల ప్రాజెక్టు సూపర్‌వైజర్ ఎం జోజమ్మ చెప్పారు. మండలంలోని కొండవీడు గ్రామం మండల ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో సోమవారం ఐసీడీఎస్ సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా బాల్య వివాహాల నిర్మూలనపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొండవీడు గ్రామ పంచాయతీ సర్పంచ్ షేక్ మొహమ్మద్ యూనీస్, పాఠశాల హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు, ఎంఎస్‌కే రాణీ, ఏఎన్ఎం నాగమణి, సోలస సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఆరంభమైన ధ్వజస్తంభ ప్రతిష్ట


స్వామీజీని సత్కరిస్తున్న సభ్యులు, నిర్వాహకులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని పురాతన దేవాలయమైన శ్రీ కోదండరామస్వామి వారి ఆలయంలో నూతన ధ్వజస్తంభ, నూతన గాలిగోపుర కలశ ప్రతిష్ట మహోత్సవాలను సోమవారం ఘనంగా ప్రారంభించారు. టీటీడీ ఆగమన పండితులు నారాయణం తనూజ్ విష్ణువర్ధనాచార్యులు, ఆలయ అనువంశిక అర్చకులు నారాయణం రామమోహనాచార్యులు గారి ఆధ్వర్యంలో మొదటి రోజు విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచన, రక్షాబంధనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న హిమాలయ స్వామీజీ స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు హిమాలయ స్వామీజీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పురోహితులు యడవల్లి శ్రీనివాసశర్మ, తెలికేపల్లి బాబు, భాగవతుల రవికుమార్, గజవల్లి నాగపవన్, నారాయణం ఆనంద్, అర్చనామూర్తి, తిరుమల అమర్నాథ్, మాదాల కోటేశ్వరరావు, గాలి శ్రీనివాస రావు, మంత్రిరాజు సత్యనారాయణ, భవనాసి సాంబశివరావు, దేవులపల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు చేయూత ఇవ్వాలి


టిఎల్‌ఎం కిట్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ డీఈఓ వెంకటేశ్వరరావు

నరసరావుపేట ఈస్ట్: విభిన్న ప్రతిభావంతులు తమ కాళ్లపై తాము నిలబడేలా ప్రతి ఒక్కరూ చేయూత అందివ్వాలని సత్తెనపల్లి డిప్యూటీ డీఈఓ వెంకటేశ్వరరావు తెలిపారు. సికింద్రాబాద్ బోయినపల్లికి చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్లీ హ్యాండికాప్డ్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పాతూరులోని విభిన్న ప్రతిభావంతుల వనరుల కేంద్రం భవిత పాఠశాలలో జిల్లాలోని 131 మంది విభిన్న ప్రతిభావంతులకు ఒక్కోరికి రూ.10 వేలు విలువ చేసే టీఎల్‌ఎం కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిప్యూటీ డీఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, టీఎల్‌ఎం కిట్లను భవిత పాఠశాలల ప్రత్యేక ఉపాధ్యాయులు, శిక్షకులు పర్యవేక్షణలో సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు. కిట్లను ఉపయోగించుకోవటం ద్వారా దివ్యాంగులకు కొన్నికొన్ని అంశాలపై స్పష్టమైన అవగాహన ఏర్పడుతుందని తెలిపారు. ఎన్ఐఎంహెచ్ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల అధికారి పి.జగన్మోహన రావు మాట్లాడుతూ రెండురోజుల పాటు కిట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ కిట్లను సద్వినియోగపరుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎంఓ శ్రీనివాసరావు, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఐఈ కోఆర్డినేటర్ జి.మల్లికార్జునరావు, భవిత పాఠశాల ఉపాధ్యాయినులు మేరికుమారి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

4న విద్యార్థులకు మోడల్ పరీక్షలు

కలెక్టరేట్‌లో పోస్టర్ ఆవిష్కరించిన జేసీ, ట్రైనీ కలెక్టర్


కలెక్టరేట్‌లో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్, ట్రైనీ కలెక్టర్, అధికారులు

నరసరావుపేట: వేసవి శిక్షణ తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు సంబంధించి నిర్వహించే మోడల్ పరీక్షలకు చెందిన వాల్ పోస్టర్‌ను కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ శ్యామ్‌ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ సోమవారం ఆవిష్కరించారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో శ్రీనాథ సాహితీ పరిషత్తు సహకారంతో గత నెల రోజుల నుంచి వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి మాట్లాడుతూ జూన్ నాలుగో తేదీ మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షలు ఒకటి మహనీయులైన గౌతమ బుద్ధుడు, మహాత్మాగాంధీ, స్వామి వివేకానంద, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జవహర్‌లాల్ నెహ్రూ, మదర్‌థెరిస్సా, ఏపీజే అబ్దుల్ కలాం ఏడుగురి జీవిత చరిత్రలపై ఉంటుందన్నారు. రెండోది జనరల్ మ్యాథమెటిక్స్ పరీక్ష, మూడోది జనరల్ నాలెడ్జ్ మీద ప్రశ్నలు ఉంటాయన్నారు. తెలుగు మీడియంలో 50 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఉంటాయని, ఏడు నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు కామన్‌గా పేపర్ ఉంటుందన్నారు. పల్నాడురోడ్డులోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఉదయం 8.15 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యేవారు ముందుగా తప్పనిసరిగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్ 81062 76869, 99897 07279 నంబర్లను సంప్రదించాలన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో డీఆర్వో కె.వినాయకం, లైబ్రేరియన్ వై.రాధ, జిల్లా సెక్రటరీ ఝాన్సీ, గద్యపద్య కవి చక్రవర్తి ఈపూరి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో భూసారం


మాట్లాడుతున్న జిల్లా వనరులు కేంద్రం డీడీ ఎం శివకుమారి

చిలకలూరిపేట: చిరుధాన్యాల సాగుతోనే భూసారం పెంపొందించుకునే వీలుంటుందని జిల్లా వనరులు కేంద్రం డీడీ ఎం శివకుమారి చెప్పారు. మండలంలోని మానుకొండవారిపాలెం గ్రామంలో సోమవారం ఖరీఫ్ పంటల సాగుపై అవగాహన కార్యక్రమం జరిగింది. వ్యవసాయశాఖ మండలం ఏవో టి.శ్రీలత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో శివకుమారి మాట్లాడుతూ వేసవిలో లోతు దుక్కులు చేయడం వలన కలుపుతో పాటు నేలలోని చీడపీడలు అంతరిస్తాయన్నారు. కాంప్లెక్సు ఎరువులు పైపాటు వినియోగంతో భాస్వరం, జింకు, ఇనుమ వంటి పోషకాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉండదన్నారు. అలాగే శనగసాగు చేసే రైతులు ముందుగా తన భూముల్ని ఖాళీగా వదిలేయకుండా తక్కువ కాలపరిమితి గల చిరుధాన్యాల సాగు చేయాలన్నారు. ఫలితంగా నేల ఆరోగ్యంతో పాటు పంట దిగుబడులు పెంచుకోవచ్చన్నారు. ఏవో శ్రీలత మాట్లాడుతూ మండలం పరిధిలోని అన్ని ఆర్‌బీకేల్లో పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుమును 50 శాతం రాయితీపై అందిస్తున్నట్లు వెల్లడించారు. ఖరీఫ్, రబీసీజన్లలో వివిధ పంటల్ని సాగు చేసే రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ, ఈ క్రాప్‌నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అభ్యదయ రైతులు టి.సాంబశివారెడ్డి, బి సుబ్బారెడ్డి, ఏఈవో జీ శ్రీనివాసరావు, వ్యవసాయ గ్రామ సహాయకులు సీహెచ్ రాజ్యలక్ష్మి, అఖిల్, ప్రకృతి సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్బయ్యపాలెంలో పిడుగుపాటు

రొంపిచర్ల: మండలంలోని సుబ్బయ్యపాలెం గ్రామంలో సోమవారం కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. చిరుమామిళ్ళ శ్రీనివాసరావుకు చెందిన పశువుల కొస్టంలో ఉన్న కొబ్బరిచెట్టుపై పిడుగు పడగా కొబ్బరిచెట్టు కాండం మధ్య భాగంలో చీలికలు వచ్చాయి. పిడుగు పడ్డ సమయంలో ఉరుములు, మెరుపులతో పాటు పెద్దపెట్టున శబ్దం రావటంతో గ్రామస్తులు ఆందోళన చెందారు. పిడుగు పడిందని గ్రామస్తులు నిర్ధారణకు రాగా, కొబ్బరిచెట్టుపై పడిందని తెలియటంతో ఊపిరి పీల్చుకున్నారు.

రొంపిచర్లలో భారీ వర్షం

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్ల, చుట్టుప్రక్కల ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో ప్రారంభమైన వర్షం ఒక్కసారిగా గాలి నిలిచి పోవటంతో భారీగా వర్షం పడింది. రోహిణి కార్తె ఆరంభం నుంచి సూర్యభానుడి నుంచి వెలువడుతున్న గ్రీష్మతాపానికి ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ వర్షం కొంత ఉపశమనాన్ని ఇచ్చింది. వర్షం కురుస్తున్నంత సేపూ ఉరుములు, మెరుపులు కూడా పెద్దగా వచ్చాయి. వర్షం కురుస్తున్నంత సేపూ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

వివరాలు నమోదు చేయాలి

శావల్యాపురం: జగనన్న లేఅవుట్స్ ఇంటి పట్టా మంజూరు అయిన ప్రతి లబ్ధిదారుని సమగ్ర వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు వెల్లడించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామసచివాలయ ఇంజినీర్లతో ఆన్‌లైన్ నమోదు పురోగతిపై సమీక్షించారు. మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో జగనన్న లేఅవుట్స్ అర్హత లబ్ధిదారులను 1279 మంది ఇంటి పట్టాలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇందులో భాగంగా 883 మంది లబ్ధిదారుల జగనన్న ఇంటి పట్టాల ఆన్‌లైన్ నమోదు చేశారన్నారు. మిగిలిన లబ్ధిదారుల వివరాలన్నీ ఆన్‌లైన్ నమోదు నూరుశాతం చేస్తేనే ప్రభుత్వ ఇంటి నిర్మాణాలు అనుమతులు జారీ చేస్తుందన్నారు. తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, ఎంపీడీవో సీతారామయ్య పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఆరోగ్య సమాజ నిర్మాణం

యడ్లపాడు: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమ పేదల పాలిట వరమని పీహెచ్‌సీ వైద్యాధికారి గోపీనాయక్ చెప్పారు. మండలంలోని వంకాయలపాడు పంచాయతీలోని బోయపాలెం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ ప్రొగ్రామ్ జరిగింది. యడ్లపాడు మండల ప్రాథమిక వైద్యశాఖ ఆధ్వర్యంలో గ్రామంలోని బ్రహ్మంగారి ఆలయం ప్రాంగణంలో నిర్వహించారు. ముందుగా వైద్యులు వేసవి ఎండలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన సమాజం ఏర్పాటు లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ ప్రొగ్రామ్ గ్రామీణ ప్రాంత ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌వో పున్నారావు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.